


# సంతోషమే సగం

విప్పుళ్ళ
సూర్యప్రకాశ రావు

పైబెర్త్ మీదున్న శ్రీనివాస మూర్తి మంజులను గుచ్చి గుచ్చి చూస్తున్నాడు.

మంజుల పుస్తకంలో తల దూర్చింది. మధ్యలో తల ఎత్తి చూస్తే శ్రీనివాస మూర్తి రెప్ప వేయకుండా చూస్తూనే ఉన్నాడు.

అసహనంగా కదిలింది. అసహ్యంగా చూసింది. చిరాకుతో ఆడుకుంటున్న బాబుకి ఒక చురక తగిలించింది.

'పాడు మగాళ్ళు! తలలు బోడులు గాని తలపులు బోడులా అని ఊరకనే అన్నారా?' అనుకొంది మంజుల.

మూర్తి కిందకు దిగాడు. మంజుల పక్కను కూర్చుని, "అమ్మాయ్, వీడి గుండు మీద రెండు వెంట్రుకలుకూడా లేవు. అయినా, వీడి కిదేం పోయే కాలం అని అనుకుంటున్నావు కదూ? లేదమ్మా. కొందరిని మనకు పదే పదే చూడాలనిపిస్తుంది. అందులో మన మనసుకు నచ్చిన మనిషి పోలికలుంటే మరీను! అసభ్యంగా ప్రవర్తిస్తే క్షమించమ్మా" అన్నాడు.

మనసులోని భావాల్ని చదివేసినట్టు మాట్లాడుతున్న మూర్తిని చూసి మంజుల కంగారు పడింది. అపార్థం చేసుకున్నందుకు నొచ్చుకుంది.

"అమ్మాయ్! ఎంత అల్లరి చేసినా పిల్లల్ని అస్తమానూ కొట్టకూడదమ్మా. వాడు అల్లరి చేయక నేను అల్లరి చేస్తా గెంతితావనుకో. నలుగురూ పోగై, నాలుగు పైసలు విసిరి, అఫ్‌కోర్స్! కొందరు నా దగ్గరున్న పైకం లాక్కుని, పిచ్చి వాణ్ణని బయటకు గెంటుతారమ్మా" అని కాస్సేపాగి, "అమ్మాయ్, నీ పేరేమిటో తెలియదు గాని, ఒంటరిగా బయలుదేరావు. అబ్బాయి ..." అన్నాడు.

"నా పేరు మంజులండి. శ్రీవారు డాక్టరు. బెజవాడలో స్టేషను కొస్తానన్నారండి."

"మీరు?"

"మీరు ఏమిటమ్మా? బాబాయ్ అను. నేను శ్రీనివాసమూర్తిని. పేరు చూసి

భయపడకమ్మా. ఈడ్చి తన్నితే పాతిం రూపాయలకంటే ఎక్కువ ఉండవు నా దగ్గర. అయినా, ఈ రోజుల్లో పేర్లో ఏముందిలే! మా అత్తగారి పేరు సరస్వతి. పాపం, ఆవిడకు ఉత్తరం ముక్కకూడా వ్రాయడం రాదు.''

పక్కున నవ్వి, ''మీరు కూడా ఒంటరిగానే ...'' అంది.

''అవునమ్మా. నా జంట నా కూడా రానన్నది. రిటైరయిన వెధవని కట్టుకున్న పెళ్ళాం కూడా పట్టించుకోదనుకో.

పెళ్ళాం ఏం ఖర్మ! ఎవరూ పట్టించుకోరు. ఏదీ నీ చేతిలో ఉన్న పత్రికే తీసుకో. బాలల శీర్షిక, మహిళలకొక శీర్షిక, యువజనుల కొక శీర్షిక ... తప్పక ఉంటాయి. ముసలి వెధవ మొహాన మూడు పేజీలు కొడితే ఏం పోయింది చెప్పు?

రేడియో విందామంటే బాలల కార్యక్రమం, కార్మికుల కార్యక్రమం, యువజనుల కార్యక్రమం, రంగవల్లి తప్పితే—

ఇంట్లో కూర్చుని గోళ్ళన్నీ తినేస్తున్న రిటైరైన వాళ్ళకో ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించరేం?''

• • •

బాబుకి నిద్రవచ్చినట్టుంది. జో కొడుతూ ఊకొడుతూంది మంజుల.

''అదెందుకు, మంజులా? బస్సుల్లో చూడు, ఎక్కడైనా చూడు స్త్రీలకు ప్రత్యేక స్థలం. కాని, నిలబడలేని ముసలాళ్ళకు ప్రత్యే కస్థలం ఎందుకు కేటాయించరు?

పిల్లని, వాళ్ళని అనుకుని ఏమి లాభం? పాపి, భగవంతుడికి కూడా మా పాట్లు తెలియవు. ఎందుకంటే, ఆయనకు రిటైర్‌మెంట్ లేదు. ముసలితనం రాదు. ఎందుకొస్తుంది? అప్పుడప్పుడు అమృతం తాగేస్తుంటాడు'' అన్నాడు మూర్తి.

''అవునండి. జీతాలు పెంచాం, కరువు భత్యం పెంచాం అంటున్నారు కానీ, దానికి తగ్గట్టుగా పెన్షన్ పెంచరేం?'' బాగుండదని మంజుల కూడా ఒక సత్యం చెప్పింది.

''బాగా చెప్పావు, మంజులా! ఈ మధ్య రిటైరైన వాణ్ణి ట్రెజరీ క్లర్కు అడిగాడట. 'మీ రిప్పుడు బతికే ఉన్నారు. కాని, ఎరియర్ బిల్లుకోసం రెండు నెలల క్రితం కూడా మీరు బతికే ఉన్నట్టు సర్టిఫికేట్ కావాలండీ' అన్నాడట.

అలా వాడు అడగటం తప్పు లేదమ్మా, ఎందుకంటే, నేలొచ్చిన వాళ్ళు కాళ్ళు నేలాడేస్తున్న ఈ రోజుల్లో వెధవ వందొచ్చే పెన్షనర్ ఎలా బతికున్నాడా అని అనుమానం వచ్చిఉంటుంది.

పెన్షన్ పెంచకపోతేనేం లే, అమ్మా, వయసుతో పెరిగేవి ఉన్నాయిగా! చిరాకు, పరాకు!

ఉన్నవాళ్ళందరూ చిన్న చూపు చూస్తుంటేమాత్రం మేము నీ కండగా ఉన్నాం కదా అని అప్పటి వరకు అజ్ఞాతంగా దాగున్న రోగాలన్నీ బయట పడతాయమ్మా!

ఓడ మునిగిపోతుంటే మొదట బయటపడే వేమిటో తెలుసా?

అప్పటివరకు దాన్ని దొలుస్తున్న ఎలుకలు! అసలు నన్నడిగితే, మంజులా, రోగాలు పెద్ద పోషరమ్మ లనుకో. వాటికి చిన్నా పెద్దా, స్వపర భేదం లేదనుకో.''

మంజుల నవ్వాపుకోలేక పోతూంది. ఏదో చెప్పబోయింది.

''వాగుడుకాయ దొరికాడు ఎలారా, దేవుడా! అనుకుంటున్నావా, మంజులా? భయపడకమ్మా. బెజవాడదాకా రాను. రాజమండ్రిలో దిగిపోతా.

అందరిలాగా అయిదేళ్ళు తక్కువేమనుకుంటే ఈ కొట్టే బోరేదో ఆఫీసులో వాళ్ళకే కొట్టేవారు కదా రావూ అని అనుకుంటుంది ఇంటిది.

అప్పుడప్పుడు మన్నుండలుచేసి పెడుతుంది. అది ప్రేమ కాదమ్మా. మాట్లాడకుండా పడుంటావని.

అయినా, నా ఇంటి దాని పేరేమిటని ఇంతవరకు అడగలే దేమిటి?

ఇంకానయం. పక్కన లేదు కాబట్టి సరిపోయింది. లేకపోతే నీ మాట వినకుండా పడిపోయేది.

అన్నపూర్ణమ్మా ... అన్నపూర్ణ దాని పేరు.

ఈ మధ్యనే డాక్టర్ చెప్పాడు — అన్నపూర్ణతో ఇన్నాళ్ళు ఉన్నావు కాబట్టి ఇక మంచి రొట్టెలు, ఇమ్ముటివ్ తీసుకోమని.''

మంజుల నవ్వుతూ బాబుని దగ్గరకు తీసుకుంది.

పిఠాపురం వచ్చింది.

కిటికీ వైపు బెర్తు మీదున్న తను చేతిలో ఉన్న వార పత్రికను పక్కన పెట్టి దిగాడు.

యథాలాపంగా పేజీలు తిరగేసింది మంజుల. అందులో ఉంది తన కథ. ఇంతవరకా వారపత్రిక తను చూడనేలేదు.

ఎర్రి గంతేయాలనిపించింది మంజులకు. లేవబోతున్న మూర్తితో— ''బాబాయి గారూ! నా కథ చదివారండి ఇందులో'' అంది.

మూర్తి వారపత్రిక వంక ఓ సారి చూసి, ''నీ కథ పడిందా?'' ముక్తసరిగా అని కిందకు దిగాడు.

'ఛీ ఛీ! ఏం మనుషులో, ఏమిటో!' మంజులకు మొట్టమొదటిసారిగా తన కథ పడినపుడు ప్రమీల అన్న మాటలే గుర్తుకొచ్చాయి.

''నీ కథ పడిందా ... సరేగానీ, మా మూడో చిన్నది మూడు రోజుల నుంచి ముక్కు చీదుతూంది. మీ ఆయన క్లినిక్‌కు వెళ్ళారా లేక ఇంట్లో ఉన్నారా? ఏ మందు వేయమంటారో కనుక్కొని చెప్పు'' అని ఫోను పెట్టేసింది. ఇంకా అది నయం.

తన కథ బాగుందని అయిదారుగురు పాఠకులు వ్రాసిన ఉత్తరాలు చూసి, ''పెద్దగా పొంగిపోకే, మంజూ! అచ్చులో తమ పేరు చూసుకుని నీలాగ ముచ్చట పడే వాళ్ళందరూ చచ్చు కథల్ని మెచ్చుకుంటూ రాస్తారే'' అని తన కొచ్చిన పాండిత్యం కాస్త తన ముందు వెళ్ళగక్కింది వరల.

అందులో హాస్యం కంటే అసూయే కొట్టవచ్చింది.

ఆ ఆనందం అటువంటిది. అది అనుభవానికే అందుతుందని సరిపెట్టుకుంది.

''అమ్మాయ్,మంజూ! ఎవరిదో పత్రిక తీసుకుని నీ కథ నీవు చదవడం ఏమీ బాగా లేదమ్మా. ఇదిగో, నీ కోటి, నా కోటి'' అని ఒక పత్రిక మంజుల కిచ్చి మరొకటి తను ఉంచుకొన్నాడు.

''ఒరేయ్, బాబూ! అమ్మ కథ పడిందిరా. ఈ ఆనందంలో నీ కో బిస్కెట్ పాకెట్, అమ్మకు మూడు మామిడి పళ్ళు. అమ్మాయ్! కంగ్రాచ్యులేషన్స్!'' అన్నాడు శ్రీనివాసమూర్తి.

''అమ్మకు పళ్ళకంటే పాలకోవా ఇష్టం.'' బాబు పెద్ద ఆరిందాలా అన్నాడు.

''అలాగా?'' అని కథ చదవడంతో మునిగిపోయాడు మూర్తి.

కథ చదివిన మూర్తి కళ్ళ నీళ్ళు తుడుచుకుని, ''చాలా బాగా రాశావమ్మా. కాని, నీ కథ ఆధార మేమిటమ్మా?'' అన్నాడు.

''బాబాయ్! ఆరు నెలల క్రితం ఒక వార్తాపత్రికలో పడ్డ వార్త నాధారం చేసుకుని ఈ కథ రాశాను.''

''అలాగా? అయితే, ముగింపు నాకు బాగా లేదమ్మా. అలా కాకుండా తాగి, బంగళాలో తనని బలవంతంగా అనుభవించిన కాలేజీ కుర్రాళ్ళకు కోర్టు ద్వారా శిక్ష పడా లంటుంది సుధ.

కాని—'అయిన అల్లరి చాలదూ? ఇది మాతిలోనో, గోతిలోనో పడితే పీడా విరగడై పోతుంది.'

'ఆవిడగారు కోర్టు కెక్కే ముందు మనందరికీ తలో గుక్కెడు విషమిచ్చి పొమ్మనండి.'

• • •

అలా నోటికొచ్చినట్లు మాట్లాడుతూ, ఇప్పుడిప్పుడే పుట్టుకొస్తున్న పిల్లలకు ఎప్పుడో పెళ్ళి కాదని చుట్టాలందరూ మధని తిట్టి పోశారు.



కళావాహినివారు ఇటీవల మద్రాసులో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో అమెరికాలో ఉంటున్న నళిని ఇటీవల భరతనాట్య ప్రదర్శనం ఇచ్చింది. ఇందులో భరతనాట్యంతోపాటు ఒడిస్సీ, మణిపురి నాట్య విశేషాలనూ ప్రదర్శించి అభినందనలు అందుకుంది.

అయినా, సుధ తనపట్టు విడువలేదు. అల్లరిచేయబడ్డ ఆడది కోర్టు కెళ్ళడానికి భయపడుతుందన్న బలహీనతను ఆధారం చేసుకునే ఆడవాళ్ళ మీద అత్యాచారాలు ఎక్కువ పెరుగుతున్నాయి.

'నేను కోర్టు కెక్కుతున్నందువలన ఆడదాన్ని అల్లరి పెట్టబోయే ఏ ఒక్కడైనా వెనక్కు వెళితే నా కదే పదివేలు' అంది సుధ.

ప్రేమించిన రామం కూడా 'సుధా! నా గతం నీకు అనవసరమని ఎలా అన్నావో అలాగ ఇదీ నా కనవసరమే. ఎవరేమను కున్నా నీకు జరిగిన అన్యాయానికి నీవు నోరు మూసుకుని కూర్చో కూడ' దని ప్రోత్సహించాడు.

ఇనుమడించిన ఉత్సాహంతో మరింత ముందుకు ఉరికింది సుధ.

తలిదండ్రులు కన్నీళ్ళు పెట్టుకోవడం మినహా ఏమీ చేయలేకపోయారు.

కాని- వచ్చినోట్లకు అంతరాత్మలను జమకట్టి ఎల్లప్పుడూ తప్పుచేసిన వాళ్ళను శిక్ష నుంచి ఎలా తప్పించాలా అని తాప త్రయ పడే లాయర్లు మన దేశంలో కోకొల్లలు.

అన్యాయం జరిగిన ఆడది నిస్సహాయంగా బోనులో నిలబడితే భయ పెడుతూ, మాటలతో గారడీచేస్తూ, మగవాళ్ళు కూడా సిగ్గుపడేలా అసహ్య కరమైన ప్రశ్నలు వేసి వేధించాడు సుధని ఎదుటి లాయరు.

అదే గనక తన పెళ్ళామో, కూతురో అయి ఉంటే ఆ ప్రశ్నలకు తానే ఆత్మ హత్య చేసుకునేవా డా లాయరు!

రెండు రోజులు కోర్టు కెళ్ళిన సుధ తండ్రి నారాయణరావు మళ్ళీ వెళ్ళలేదు. అనుకున్నట్లుగానే సుధకి న్యాయం జరగలేదు.

బయట ఎత్తిపొడుపు లెక్కువ య్యాయి. సానుభూతితో అర్థంచేసుకో లేని మనుషులకు దూరంగా వెళ్ళిపోవా లనుకుంది.

అందుకే కువాయిత్‌లో ఇంగ్లీషు టీచర్ పోస్ట్‌కి బొంబాయిలో ఉన్న ఒక ఎంప్లాయిమెంట్ ఏజన్సీ పిలిస్తే వెళ్ళింది.

కానీ, అరబ్ దేశాలకు వెళుతున్న ఆడవాళ్ళ గురించి అనేక కథలు వింటున్న రామం కూడా వెళ్ళి బ్రతిమలాడి తీసు కొచ్చాడు సుధని.

ఎవరికీ తెలియకుండా అన్నవరంలో పెళ్ళిచేసుకోవాలని వెళుతున్నా రిద్దరూ.

ఇంత అల్లరి పడ్డ అమ్మాయికూడా పిచ్చివాడిలా తిరుగుతున్న కొడుకుకి నయానా భయానా నచ్చచెప్పి, లాభంలేక



ఇటీవల హైదరాబాదులోని "కళా సాగరం"లో సంగీత కచేరీచేసి శ్రోతలను రసవాహినిలో ముంచెత్తిన శ్రీమతి మణి కృష్ణస్వామి

హత్యచేయించడానికి కూడా వెనకాడ లేదు రామం తండ్రి, రాజమండ్రి హోటల్ గదిలో.

హత్యానేరం ఆ రూమ్‌లోనే ఉన్న సుధ మీద తెలివిగా మోపబడింది.

ఇక రామం లేనప్పుడు తన బ్రతు కెందుకని నేరం తనే ఒప్పుకుంది సుధ.

చూడమ్మా, మంజూ! నేను వెధవా యని. నోటి కొచ్చినట్టు చెప్పాను కథని. నీవు నేర్పుగా మార్పు చేర్పులతో రాస్తే బాగుంటుంది. ఏమంటావు?" అని అడి గాడు శ్రీనివాసమూర్తి.

"బాగానే ఉంటుంది. కాని, అది వాస్తవానికి ... "

"దగ్గరగా ఉండదంటావు. అవును. కొన్ని నిజాలు నమ్మడగ్గవిగా ఉండవు.

నీ కథలోని సుధ నా ఏకైక సంతానం లతేనని, నారాయణరావు నేనేనని అంటే నీవు నమ్మగలవా?" అని వేదాంతిలా నవ్వాడు శ్రీనివాసమూర్తి.

అవాక్కయింది మంజుల. నమ్మ లేనట్టు ఆశ్చర్యంగా చూస్తోంది.

"ఏమి టలా చూస్తావు? వీడు తండ్రా లేక బండరాయా? ఇలా మొండిగా ఎలా ఉండగలుగుతున్నాడు అని అనుకుం టున్నావా?

అరెరె! స్టేషనొచ్చింది. ఏ స్టేషనో చూడమ్మా."

"రాజమండ్రి.

"రాజమండ్రా? ఇక్కడే నేను దిగాలి."

"ఇక్కడ మీకు ఎవరున్నారు, బాబాయ్?"

"రాజమండ్రి జైల్లోనే ఉంటున్నది లత!" అని శ్రీనివాసమూర్తి దిగు తున్నాడు.

"మంచివాళ్ళకే పెడతాడు కష్టాలు భగవంతుడు!" అంది విచారంతో మంజుల.

"అవునమ్మా. దుష్టుడికి దూరంగా ఉండాలని మనకే కాదు, భగవంతుడికీ తెలుసు" అని శ్రీనివాసమూర్తి ప్లాట్ ఫారంమీద జనంలో కలిసిపోయాడు.

కొందరు చిన్న కష్టానికే మిన్ను విరిగి మీద పడ్డట్టు బాధపడతారు. గోరం తలు కొండంతలు చేసుకుంటారు.

వచ్చేటప్పుడు తన పక్కన కూర్చున్నా యన అప్పుడప్పుడు వచ్చే తలనొప్పి గురించి తనకు తలనొప్పి వచ్చేలా, డాక్టరు కళ్ళజోడు కూడా పెట్టుకోమన్నాడని బస్సు దిగేవరకూ చెపుతూనే ఉన్నాడు.

ఆయన మాటలు వింటూంటే ప్రపంచమంతా బాధామయమైనట్లు అని పించింది తనకు.

అటువంటి మనుష్యుల మధ్యలో శ్రీనివాసమూర్తి! ఊహించలేకపోతోంది మంజుల.

అంతలో- శ్రీనివాసమూర్తి గొప్పుతూ వచ్చి మంజుల చేతిలో పాలకోవా పాకెట్ పెట్టాడు. కళ్ళు చెమర్చాయి మంజులకు. ఆకతాయిగా బాబు చెప్పిన మాటలకు ఎంత విలువిచ్చా రీయన! మాటలు పెగిలి రావడం లేదు మంజులకు.

"చూడమ్మాయ్, మంజులా! నీవు ఏం ఆలోచిస్తున్నావో నాకు తెలుసు. మన దుఃఖాన్ని మనలోనే ఉంచుకుని నలుగురికీ సంతోషమే పంచాలన్నారు పెద్దలు.

ఏడ్చేవాణ్ణి అందరూ ఏడిపిస్తారమ్మా. కష్టాలూ అంతే.

ఎప్పుడూ నవ్వేవాణ్ణి ఏడిపించడానికి భగవంతుడు కూడా వెనకాడతాడమ్మా.

అయినా, తాతకు దగ్గులు నేర్పు తున్నా నేమిటి? నీవు రచయిత్రివికదూ? అదేమిటమ్మాయ్, అసలు మాట్లాడవు? పోనీ, ముసలివెధవ పరుగెత్తుకొచ్చి పాలకోవా ఇచ్చాడు కదా కనీసం థాంక్సయినా చెప్పవమ్మా" అని చేయి ఊపు తున్నాడు శ్రీనివాసమూర్తి.

కాని—కదులుతున్న రైల్లో కళ్ళనీళ్ళు నింపుకున్న మంజులకు శ్రీనివాసమూర్తి అలుక్కుపోయి, హాలాహలాన్ని అవలీలగా మింగి చిరునవ్వులు చిందిస్తున్న భోళాశంకరుడిలా కనిపిస్తున్నాడు! ★